క్లుప్తంగా

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని జైత్రాతండాలోని కొద్ది రోజులుగా విష జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం జిల్లా వైద్యాధికారులను గ్రామానికి తీసుకెళ్లి బాధితుల ఇంటింటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బాధితులను పరీక్షించి తగిన సలహాలు, సూచనలు అందించారు. బాధితులను జ్వరాల బారి నుంచి రక్షించాలని ఎమ్మెల్యే వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ అధికారులు తండాను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : భువనగిరి జిల్లా ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న కోడి భవ్య, గాదె వైష్ణవిల మృతిపై సిట్టింగ్ జడ్జీతో సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని గొర్రెల పెంపకందారుల సహకారం సంఘం జిల్లా కార్యదర్శి ఉరిబండి శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకే గదిలో ఉంటూ చిన్ననాటి స్నేహితులైన వీరు అకాల మృతిపై పలు అనుమానాలు ఉన్నందున సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సాగునీటి విడుదలను పొడిగించాలి

వేములపల్లి : సాగర్ ఎడమకాల్వ ద్వారా విడుదల చేస్తున్న నీటిని మరో పది రోజులపాటు కొనసాగించి పంటలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మండల పరిధిలోని సాగర్ ఆయకట్టు కింద ఎండుతున్న వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. యాసంగిలో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు బోరుబావుల ద్వారా సాగు చేపట్టారని కాని ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రస్తుతం విడుదల చేస్తున్న ఎడమకాల్వ నీటితో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి లేదని ప్రభుత్వ స్పందించి వెంటనే ఎడమకాల్వకు మరో పది రోజులు నీటిని పొడిగించి పంటలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెగాని సైదులు, వెంకన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓను సస్పెండ్ చేయాలి

కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లాలో ఇంటర్ విద్యా వ్యవస్థ దెబ్బతినడానికి కారణమైన డీఐఈఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యల పరిష్కారానికి కనీస చర్యలు తీసుకోవడం లేదని, నకిలీ సర్టిఫికెట్లతో అనేక మంది ఉద్యోగాలు పొంది రెగ్యులర్ అయ్యారని పేర్కొన్నారు. సమావేశంలో పద్మావతి, బేబి, అనూష, రోజా, అభిరామ్, ఆంజనేయులు, గణేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

కొర్రోనితండాలో వైద్యశిబిరం

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొర్రోనితండాలో సోమవారం కొండమల్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తండావాసులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 20 మందికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణకుమారి , వైద్యాధికారి ఉషారాణి, వైద్య సిబ్బంది ఏఎన్ఎం ఇషాక్, ఆశా వర్కర్లు జ్యోతి,ల్యాబ్ టెక్నీషియన్లు, మాజీ సర్పంచ్ కొర్ర లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసిన ముదిరాజ్‌లు



ఎమ్మెల్యే బాలూనాయక్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

డిండి : పట్టణానికి చెందిన శివపార్వతి ముదిరాజ్ సంఘం సభ్యులు సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గంగా భవాని ఆలయాభివృద్ధికి సహకరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం శాలువా కప్పి ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పోలం శ్రీనువాసులు, ప్రధానకార్యదర్శి బల్మూల ప్రేమ్‌కుమార్, కోశాధికారి మల్లేష్ సంఘం సభ్యులు కాశన్న, వెంకటేష్, లక్ష్మణ్, శ్రీను, లింగమయ్య, శ్రీను పాల్గొన్నారు.

అడుగంటిన చెరువులు, వాగులు

- వట్టిపోతున్న బోర్లు, బావులు
- ఎండుతున్న పంటపొలాలు
- ఆందోళనలో రైతులు



ఎండిపోయిన నాయినవానికుంట చెరువు



పెద్దవాగులో తేలిన విద్యుత్ మోటార్లు

పెద్దవూర: ఏడెనిమిది నెలలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన మండలంలోని చెరువుల్లో చుక్కనీరు లేక వట్టిపోయాయి. ఈ వేసవి ప్రారంభం కాకముందే తీవ్రమైన ఎండలకు తోడు ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బోర్లు, బావులు ఒట్టిపోతున్నాయి. గత నెల రోజుల క్రితం వరకు ఆగకుండా రోజంతా రెండు, మూడు ఇంచులు పోసిన బోర్లు సైతం ప్రస్తుతం ఐదు నిమిషాలు ఆగితే నిమిషం సేపు పోస్తు ఆగిపోతున్నాయి. ఈ ఏడాది మండలంలో బోర్లు, చెరువుల, ఏఎమ్మార్పీ కాలువల పరిధిలో వేలాది ఎకరాల్లో మిరప పంటను సాగుచేశారు. ఆరుగాలం శ్రమించి లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన పంట తీరా చేతికొచ్చే దశలో నీళ్లలేక ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. పంటలను కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తు అప్పులు చేసి బోర్లు వేస్తున్నా వారి ఆశలు ఫలించటం లేదు. కనీసం ఏఎమ్మార్పీ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులను,కుంటలను నింపితే భూగర్భ జలాలు పెరిగి బోర్లు పోసేవని రైతులు పేర్కొంటున్నారు. అప్పులిచ్చిన వాళ్లు తరచూ ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలంటూ అడుగుతుండటంతో సమాధానం చెప్పలేని నిస్సహాయ స్థితి రైతన్నలకు ఎదురైంది.

చెరువుల కింద 752.38 హెక్టార్ల సాగు

గత ఏడెనిమిది నెలలుగా వర్షాలు పడక పోవడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో చెరువులు అన్ని ఎండిపోయాయి. పెద్దవూర మండలంలో పెద్దవూర చెరువు, వెల్మగూడెం(రాగిచెరువు) కింద 95 హెక్టార్లు, బసిరెడ్డిపల్లి(ఉత్తరం చెరువు) కింద 34, సంగారం(నల్లచెరువు) కింద 90.05, తిమ్మాయిపాలెం, నాయకునితండా చెరువు 81.35, పెద్దచెరువు కింద 172.17, తెప్పలమడుగు(ఇమాంకుంట) 15, చలకుర్తి(ఊరచెరువు) 32.20, చింతపల్లి(చింతలచెరువు) 39, పర్వేదుల(చింతలచెరువు) 21.01, శిర్శనగండ్ల(ఊరచెరువు) 32.20, చలకుర్తి(ప్రత్యేక ఎత్తిపోతల పథకం) 84 హెక్టారులు, నాయినివానికుంట చెరువు, తుంగతుర్తి, గర్నెకుంట గ్రామాల్లో చెరువుల ద్వారా మొత్తం 752.38 హెక్టార్లకు సాగు నీటితో పాటు తాగునీటిని అందిస్తున్నాయి. ఇలా చిన్నవి, పెద్దవి కలిపి పెద్దవూర మండలంలో 13 ఉన్నాయి. వీనిలో కేవలం శిర్సనగండ్ల, పెద్దవూర, పోతునూరు చెరువుల్లో మాత్రమే నీళ్లు ఉన్నాయి. మిగిలిన చెరువులన్నీ ఎండిపోయాయి. దీంతో పాటు నిత్యం కృష్ణాతాగునీటి వృధా జలాలతో జీవనదిలా పారే పెద్దవాగు సైతం ఎండిపోయింది. ఈ వాగు పరిధిలోని ఈదులగూడెం, పెద్దవూర, పిన్నవూర, బట్టుగూడెం, కొత్తగూడెం, తెప్పలమడుగు, పెద్దగూడెం, లింగంపల్లి, చిన్నగూడెం గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు వాగును నమ్ముకుని కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసుకుని పంటలను సాగు చేసుకుంటున్నారు.

వేయి ఎకరాలకు పైగా వరి సాగు..

నాన్ ఆయకట్టు ప్రాంతమైన పెద్దవూర మండలంలో బోర్లు, బావులు, చెరువుల కింద వేయి ఎకరాలకు పైగా వరి పంటలను సాగు చేశారు. వేసిన వరినాట్లు వాతావరణంలో మార్పులకు వరి చేలకు మొగిలి తెగులు సోకి మొక్కలో ఎదుగుదల లేక ఎండిపోతున్నాయి. పక్కనే నాగార్జునసాగర్ జలాశయం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులు ఉన్నా వందలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసి పండించిన పంట చేతికి వచ్చే వరకు రైతుకు భరోసా లేకుండా పోతుంది. గత ఏడెనిమిది నెలలుగా వర్షాలు పడక పోవడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు పంటలను కాపాడుకోవటానికి పడరాని పాట్లు పడుతున్నా ఫలితం లేకుండా పోయింది.

చెరువులను నింపాలి



మండలంలోని చెరువులు ఎండిపోయి చుక్కనీరు లేక పశువులకు సైతం తాగునీరు దొరకని పరిస్థితి ఉంది. మా గ్రామ చెరువు ఎండిపోయి నాలుగైదు నెలలు అవుతుంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు, బావులు వట్టిపోయాయి. దీంతో చెరువుల పరిధిలోని బోర్లు, బావులు ఒట్టిపోయి చుక్క నీరు పోయడం లేదు. నీరు సరిపోక వరిపొలాలు, మిరప పంటలు, బత్తాయి తోటలు ఎండిపోతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి ఏఎమ్మార్పీ నీటితో చెరువులను నింపాలి.

– ఇరుమాది శ్రీనివాస్‌రెడ్డి, రైతు, తుంగతుర్తి

ప్రత్యేక అధికారులకు సహకరించాలి



సర్పంచ్‌లను సన్మానిస్తున్న జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు

గుర్రంపోడు : గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథతో పాటు స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకుని నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి కె. మాధవరెడ్డి మాట్లాడుతూ మూడెకరాల వరకు రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమైనట్లు తెలిపారు. త్వరలో రైతులందరికీ రైతు బంధు అందుతుందన్నారు. మండల విద్యాధికారి తరి రాము మాట్లాడుతూ ×మన ఊరి– మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు లేకపోవడంతో అధికారుల నివేదికలకే సమావేశం పరిమితమైంది. ఆయా శాఖలపై ప్రశ్నలు అడిగే వారు కరువయ్యారు. పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లను మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంపీటీసీ కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌కు తెలంగాణ యువజన సంఘం అధ్యక్షులు సుంకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుంకు శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను నిషేధించడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వాడుతున్న షాపులకు జరిమానా విధించాలన్నారు. ప్రధానంగా ఖమ్మం, నల్లగొండ, మిర్యాలగూడ రోడ్లల్లో పరిసరాలను శుభ్రం చేయాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘం ఉపాధ్యక్షులు మురళి, చిమట ఎరయ్య, సత్యనారాయణ, బిక్షాలు, గంగరాజు, కిరణ్, వెంకట్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



అల్పాహారానికి ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గుర్రంపోడు : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం గీత అన్నారు. సోమవారం నల్గొండ డైమండ్ లయన్స్‌క్లబ్ వారు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు రూ. 6వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డైమండ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అలుగుబెల్లి పాపిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మైల అశోక్‌రెడ్డి, సభ్యులు పాల్వాయి లక్ష్మారెడ్డి, అలుదాస్ వెంకన్న, సముద్రాల అశోక్ , పాఠశాల టీచర్లు మంజుల, వీరస్వామి, శేఖర్, రఘునాద్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మండలంలోని పోచంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అల్పాహారాన్ని బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆఫౌండేషన్ చైర్మన్ పాండరంగారెడ్డి విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేసి మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా పాఠశాలలోని వి ద్యార్థులందరికీ ఉదయం సాయంత్రవ వేళలలో అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. అల్పాహారంగా చిరుధాన్యాలు, పౌష్టికాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం కె. రామాచారి, మాజీ సర్పంచ్ నిమ్మల అంజిరెడ్డి, శంకర్, కుర్మారెడ్డి, సోమరాములు, టీచర్లు వెంకటయ్య, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

నల్లచౌట చెరువులోకి నీటి విడుదల



నల్లచౌట చెరువులోకి వస్తున్న కృష్ణా జలాలు

నిడమనూరు : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువులోకి సోమవారం నీటిని విడుదల చేశారు. ఈనెల 3వ తేదీన సాక్షిలో నల్లచౌట చెరువు నిండేదెలా అనే శీర్షికన కథనం వచ్చింది. సాగర్ ఎడమ కాల్వకు సాగు నీటి విడుదల చేయకపోవడంతో చెరువును నింపలేకపోయారు. పాలేరు రిజర్వాయర్ నింపడానికి సాగర్ ఎడమకాల్వకు నాలుగు రోజుల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం ఎడమకాల్వపై ఉన్న మేజర్లకు నీటిని కొద్ది మొత్తంలో విడుదల చేశారు. అదే విధంగా సోమవారం ఎడమకాల్వకు నర్సింహులగూడెం మైనర్ తూమును ద్వారా చెరువులోకి నీటిని వదిలారు. కెనాల్ నుంచి చెరువులోకి ఫీడర్ చానెల్ లేకపోవడం వల్ల పంటకాల్వల ద్వారా, పొలాల నుంచి వచ్చే నీరే చెరువుకు ఆధారంగా మిగిలింది. కాల్వలు సైతం గడ్డితో నిండి నీరు వేగంగా వెళ్లకుండా పక్కనున్న పొలాల్లోకి, బీడుభూముల్లోకి పోతున్నాయని రైతులు కొంత వ్యతిరేకత చూపుతున్నారు. కొంత మంది రైతులు కాలువలో అడ్డుగా ఉన్న గడ్డి, చెత్తను జేసీబీ ద్వారా తొలగించడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 9వ తేదీ వరకు ఎడమకాల్వకు నీటి సరఫరా చేయనున్నారు. ఈలోగా ఎంత వరకు అయితే అంతవరకు చెరువును నీటితో నింపడానికి రైతులు ప్రయత్నం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మిర్యాలగూడ : గ్రామంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అవంతీపురం గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌అండ్‌బీ ఏఈ మౌనికరెడ్డి అన్నారు. సోమవారం గ్రామ ప్రత్యేకాధికారిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మౌనికను పంచాయతీ కార్యదర్శి సోమడి గాయత్రిరెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు ఉప్పుతుల్లా మహేశ్‌లు ఘనంగా సన్మానించారు. అనంతరం మౌనిక మాట్లాడుతూవేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజ్మీరా జ్యోతి, కాంగ్రెస్ నాయకులు పద్మ, అరుణ, పద్మ, లక్ష్మి, సైదమ్మ, ఝాన్సీ, సైదులు, పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



చింతపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : కార్మికులను ఇబ్బంది పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. సోమవారం ఆశా డే సందర్భంగా దామరచర్ల మండల కేంద్రంలో ఆశాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలు అందించాలన్నారు. ఈనెల నెల 16న నిర్వహించే సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు మహేశ్వరి, జయమ్మ, శారద, శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

చింతపల్లి : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుగుంట్ల రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లా వెంకటయ్యలు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

గర్ల్స్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలి



దేవరకొండ : కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరకొండ : ఈనెల 10,11వ తేదీల్లో నలల్లగొండ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ సభను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు నేనావత్ ఉమ పిలుపునిచ్చారు.సోమవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బడిగ వెంకటేశ్‌లతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సరస్వతి,అనిత, అఖిల, దివ్య, మంజుల ఉన్నారు.

కొండమల్లేపల్లి : ఈనెల10, 11తేదీల్లో దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు నేనావత్ ఉమా పిలుపునిచ్చారు. సోమవారం ఆ కన్వెన్షన్ సంబంధించిన కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమావత్ లక్ష్మణ్, వెంకటేశ్, సరస్వతి, అనిత, అఖిల, దివ్య, మంజుల, సుప్రియ, శ్రావణి, అనూష, నందిని, హసీనా, శారద, సానియా, అనూష, నిర్మల, రాజేశ్వరి పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : ఈ నెల 10, 11వ తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ కోరారు.సోమవారం మండలంల కేంద్రంలో మండల కమిటి ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దున్న రవి, ఎర్ర చందూ, అనీల్, తదితరులున్నారు.

పాఠశాలలో నర్సరీ తొలగించాలని వినతి

నిడమనూరు : మండలంలోని బంకాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సరీని, శిథిల భవనాన్ని తొలగించాలని గ్రామానికి చెందిన నాయకులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో శిథిల భవనం ఉందని, ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నామన్నారు. విద్యార్థులు, యువకులు వ్యాయామం, ఆటలు ఆడటానికి అడ్డుగా నర్సరీ, శిథిల భవనం ఉన్నాయన్నారు. నర్సరీని గ్రామం పక్కనే ఉన్న తన స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ అధికారులకు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సింగిల్ విండో చైర్మన్ ఉన్న చిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్, సత్యనారాయణ, చిన్న సైదయ్య, బొంగరాల శ్రీనివాస్, రాంబాబు, లింగయ్య, బండి శ్రీను, మూర్తి, నాగేందర్, శేషు, కోటి, సాయి వంశీ, ఇంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలి

దేవరకొండ : పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల డీఆర్ బకాయిలు మంజూరు చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ అధ్యక్షుడు తాడిశెట్టి నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం దేవరకొండలోని ఆ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మూడు డీఆర్‌లను మంజూరు చేసి పెన్షన్‌దారులను ఆదుకోవాలని ఆయన కోరారు. హెల్త్ కార్డులపై అన్ని రకాల వైద్య సేవలను అందించాలని అన్నారు. సమావేశంలో కార్యదర్శి అంకం చంద్రమౌళి, కంచర్ల నారాయణరెడ్డి, పంగునూరి లింగయ్య, గంగిడి దామోదర్‌రెడ్డి, ఐజాక్, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కవి యాత్రను విజయవంతం చేయాలి

హాలియా : సిలివేరు సాహితీ సేవా కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 11న కోదాడ నుంచి నడిగూడెం వరకు చేపట్టనున్న కవియాత్రను విజయవంతం చేయాలని ఆ కళాపీఠం అధ్యక్షుడు లింగమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ చేతుల మీదుగా కవి యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, జ్ఞానం పంచడం కవియాత్ర లక్ష్యమన్నారు. ప్రజల వద్దకు వెళ్లి వారి మధ్యన కవిత్వం వినిపించడం దీని ప్రత్యేకతన్నారు. ఈ యాత్రలో కవులు, రచయితలు, సమాజ సేవకులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత, గాయకులు శ్రీకాళ రామ్మూర్తి, జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీరామోజు హరికృష్ణ, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, ఎల్ఈడీ టీవీ బహూకరణ



అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ బహూకరిస్తున్న డౌహిల్ స్కూల్ యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలకు దాత రావిరాల నాగేందర్, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లతో పాటు భోజనం, అదేవిధంగా మన్నెం శ్రీధర్ రెడ్డి సహకారంతో పాఠశాలకు ఎల్ఈడీ టీవీతో పాటు విద్యార్థులు రాగిజావను తాగేందుకు కప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు మాలి సైదులు, ఎస్ఎంసీ చైర్మన్ గురువయ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శైలజ, సుశీల, ఇందిర, సీతారాం తదితరులున్నారు.

అలాగే పట్టణంలోని రెడ్డికాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి డౌహిల్ స్కూల్ కరస్పాండెంట్ సాయి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌లు దాతల సహకారంతో సుమారు రూ.15వేల విలువగల ఎల్ఈడీ టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్ సంధ్యా, మల్లిఖార్జున్, శ్రీనువాస్, హన్మంతు, శివ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

మిర్యాలగూడ : జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ సత్తా చాటాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్‌నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలపై కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి యువజన కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో నాయకులు శివకుమార్ నాయక్, అజయ్‌కుమార్, కుక్కల సురేష్, శివచరణ్, కిరణ్, శివ, మున్నా, ముని పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వరగతి విద్యార్థి బి.పవన్‌కుమార్ శనివారం నల్లగొండలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షలో జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం చెరుపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు పవన్‌కుమార్ డీఈఓ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఉపాధ్యాయులు కొర్ర లోక్యనాయక్, లింగారెడ్డి, అశోక్‌రెడ్డి, సంపత్‌కుమార్, వెంకటయ్య, సుధాకర్, సముద్రాల శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీపతిరావు, కలమ్మ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డిండి : వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కలకొండ కాంతయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల ఐదో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు భద్రత కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలన్నింటిని వర్తింపజేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. అనంతరం సీపీఐ తరుపున గెలిచి ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించిన మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్సింహ్మ, తూం బుచ్చిరెడ్డి, ఎండి.మైనోద్దిన్, కనకాచారి, శైలేష్, శ్రీనయ్య,హుస్సేన్,నూనే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

31 ఏళ్ల తర్వాత కలిసిన బాల్యమిత్రులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో గల ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్‌లలో 1 నుంచి 10 వ తరగతి వరకు చదువుకున్న 1982– 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 31ఏళ్ల తర్వాత ఒకే వేదికపైన కలుసుకున్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులో గల శ్రీలక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్‌లో వారు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. అనంతరం నాడు చదువు చెప్పిన గురువులు కె.వెంకన్న, మట్టంరాజు, సత్యనారాయణరావు, సీహెచ్. శ్రీనివాస్, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, జగన్నాథం, సుబ్బమ్మ, స్వరూపారాణిలను వారు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సింహరావు, వసంత, బట్టు వెంకటేశ్వర్లు, సీహెచ్. భిక్షం , బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కె. శ్రీవెంకట్, శ్రీనివాస్, ఇమాంబి, సీ.జ్యోతి, కె.కళ్యాణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుర్రంపోడు : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని పిట్టలగూడెం గ్రామానికి చెందిన ఎదుళ్ల భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న చామలోనిబావి గ్రామానికి చెందిన బజారు, పిట్టలగూడెంలకు చెందిన రమేష్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్రం, పాల్గొన్నారు.

ఈ కేవైసీ పూర్తి చేయాలి

పెద్దవూర : రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈ నెల 28వ తేదీలోగా ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని డీటీసీఎస్ ఎండీ. ముక్తార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పులిచర్ల, పోతునూరు గ్రామాల్లోని రేషన్ దుకాణాలను, ఈ కేవైసీ నమోదును పరిశీలించారు. రేషన్ కార్డుకు ఆధార్ కార్డు లింక్ అయ్యి ఈ–కేవైసీ ఉంటేనే రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆయా రేషన్ దుకాణాల డీలర్లు ఉన్నారు.